క్లుప్తంగా

టీ షర్టు తెచ్చిన తంటా

- రూ.రెండుకే విక్రయిస్తామని ప్రచారం
- భారీగా వచ్చిన ప్రజలు
- షట్టర్ దించేసిన యాజమాన్యం

నెల్లూరు(బారకాసు): నగరంలోని నిప్పో సెంటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ వస్త్ర దుకాణంలో రూ.రెండుకే టీ షర్టును విక్రయిస్తామని విస్తృత ప్రచారం చేశారు. దీంతో ప్రజలు భారీగా శనివారం తరలిరావడంతో అసలేమి జరుగుతోందో అక్కడ ఎవరికీ అర్థం కాలేదు. చివరికి నిర్వాహకులు చేతులెత్తేశారు. ఫలితంగా పోలీసులు రంగప్రవేశం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వెంకయ్యస్వామికి విశేష పూజలు



మనుబోలు: స్థానిక బీసీ కాలనీ సమీపంలో ఉన్న భగవాన్ వెంకయ్యస్వామి మందిరంలో శనివారం పంచామృతాభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. వెంకయ్యస్వామి విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. గంధళ్ల కృష్ణయ్య, అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వైభవంగా పల్లకిసేవ



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లోని లక్ష్మీగోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం దేవదేవేరులకు విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిసేవను వైభవంగా నిర్వహించారు. స్వామివారు విశేషాలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.

వీఎస్‌యూ విద్యార్థినికి డాక్టరేట్



వెంకటాచలం: వీఎస్‌యూ మెరైన్ విభాగం పరిశోధన విద్యార్థిని కే మౌనికకు డాక్టరేట్ లభించింది. ఆమె ప్రొఫెసర్ హనుమారెడ్డి పర్యవేక్షణలో 'మానిటరింగ్ ఆఫ్ హెవీ మెటల్స్ కంటామినేషన్ ఇన్ కమర్షియల్లీ ఇంపార్టెంట్ ఆన్ ఫిష్ అండ్ ప్రాన్సెస్ కలెక్టెడ్ ఫ్రమ్ నెల్లూరు కోస్ట్' అనే అంశంపై పరిశోధనలు సాగించి పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. ఇందుకు గానూ వీఎస్‌యూ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మౌనికను వీసీ అల్లం శ్రీనివాసరావు, ఇన్‌చార్జి రిజిస్ట్రార్ కే సునీత, తదితరులు అభినందించారు.

బట్వాడిపాళెంలో బేజారే..!

- కానరాని ట్రాఫిక్ ఐల్యాండ్, స్పీడ్ బ్రేకర్లు
- వాహనాలను తిప్పాలన్నా కష్టమే
- ప్రజల అగచాట్లు



రోడ్డు మధ్యలో స్తంభం



ఇష్టానుసారంగా వెళ్తున్న వాహనాలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని బట్వాడిపాళెం సెంటర్ రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నా, ఆ స్థాయిలో వసతులు కానరావడంలేదు. ఈ ప్రాంతం మీదుగా నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇటీవల రోడ్డును విస్తరించినా, ట్రాఫిక్ ఐల్యాండ్‌తో పాటు స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయడాన్ని విస్మరించారు. ఫలితంగా వాహనాలను తిప్పాలన్నా, కష్టం ఎదురవుతోంది. మరోవైపు ఇసుక ట్రాక్టర్లు విచ్చలవిడిగా రాకపోకలు సాగిస్తుండటంతో ఆ దుమ్ము వాహనచోదకుల కళ్లలో పడుతోంది. ట్రాఫిక్ ఐల్యాండ్ లేకపోవడంతో ప్రమాదాలు నిత్యకృత్యమవుతున్నాయి. వేగ నిరోధకాల్లేకపోవడంతో మితిమీరిన వేగంతో పలువురు దూసుకెళ్తున్నారు. వాహనాలను విచ్చలవిడిగా నిలుపుతుండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం తలెత్తుతోంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రోడ్లను పూర్తి చేయాలి



కొత్తగా వేసిన రోడ్ల అంచులను పూర్తిగా సరి చేయాలి. రోడ్డు, నేలకు చాలా తేడా ఉండటంతో వాహనాలు పడిపోతున్నాయి. ట్రాఫిక్ పోలీస్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. – గోపాల్‌రావు

అధికారులు చర్యలు చేపట్టాలి



వాహనాలపై వ్యాపారం చేసే వారి మైక్‌ల సౌండ్ విపరీతంగా ఉంటోంది. ఈ బండ్లు సెంటర్‌కు అడ్డమైపోతున్నాయి. నిబంధనలను పాటించేలా అధికారులు అవగాహన కల్పించాలి. – డబ్బుగుంట ప్రతాప్

సెంటర్‌లో విగ్రహాన్ని నెలకొల్పాలి



ట్రాఫిక్ ఐల్యాండ్‌ను ఏర్పాటు చేసి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తే వాహనాలు సక్రమంగా రాకపోకలు సాగిస్తాయి. మదర్‌థెరీసా విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పినా, యత్నాలు మధ్యలోనే ఆగిపోయాయి. – మల్లెల నటరాజ్

స్కూటర్ నడపడం కష్టంగా ఉంది



బట్వాడిపాళెం సెంటర్‌లో స్కూటర్‌ను నడపడం చాలా కష్టంగా ఉంది. ఎవరు ఏవైపు వాహనాలు నడుపుతున్నారో అర్థం కాక ఇబ్బందిగా ఉంది. పిల్లలను స్కూల్‌కు తీసుకెళ్లే సమయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు దాటాలన్నా, కష్టంగా ఉంది. – వాడపల్లి లక్ష్మి

భక్తిశ్రద్ధలతో ఆడికృత్తిక



నెల్లూరు(బృందావనం): ఆడికృత్తికను పురస్కరించుకొని మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో బాలసుబ్రహ్మణ్యేశ్వరుడికి అభిషేకాలు, పూజలను శనివారం నిర్వహించారు. అనంతరం వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి నెమలి హనసేవ, పేట ఉత్సవాన్ని జరిపారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

గౌతు లచ్చన్న పేరిట జిల్లాను ఏర్పాటు చేయాలి



గౌతు లచ్చన్న చిత్రపటానికి నివాళులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతు లచ్చన్న పేరిట జిల్లాను ఏర్పాటు చేయాలని బీసీ నేత, గౌడ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదయగిరి నరసింహులు కోరారు. నగరంలోని కిలారి తిరుపతినాయుడు కల్యాణ మండపంలో గౌతు లచ్చన్న జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జై గౌడ్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, గిరిజన సంఘ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు రవి, మాలమహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ స్వర్ణా వెంకయ్య, గౌడ ఉద్యోగ సంఘ రాష్ట్ర నేత దద్దోలు రమణయ్య, శ్రీరాములు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

22న చలో కలెక్టరేట్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

నెల్లూరు (టౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం చలో కలెక్టరేట్‌ను ఈ నెల 22న నిర్వహించనున్నామని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వెన్ను నరేంద్ర పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బాలాజీనగర్‌లోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి 14 నెలలు పూర్తయినా, విద్యార్థులకు ఇచ్చిన హామీలను నేటికీ నెరవేర్చలేదని ఆరోపించారు. జీఓ నంబర్ 77ను రద్దు చేయడంతో పాటు ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించిన రూ.6400 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు విక్రమ్, నేతలు ప్రవీణ్, యజ్ఞేష్, సంతోష్ పాల్గొన్నారు.

శ్రీహరిస్వామికి సత్కారం



నెల్లూరు(బృందావనం): నగరానికి చెందిన అర్చకుడు, జ్యోతిష్య పండితుడు తెనాలి శ్రీహరిస్వామిని పురమందిరంలో శనివారం సత్కరించి స్ఫూర్తి అవార్డును ప్రదానం చేశారు. తమిళనాడులోని హొసూరులో ఇటీవల నిర్వహించిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్‌ను ఆయన అందుకున్నారు. ఈ క్రమంలో పినాకినీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సత్కరించారు. న్యూ సమైఖ్య మ్యారేజ్ మీడియేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గున్నం శ్రీనివాస్, జంగమ సేవా సంఘ రాష్ట్ర అధ్యక్షుడు గంధవళ్ల దశరథరామయ్య, పంచాక్షరి మల్లయ్య, చలపతిస్వామి, శర్మ, పురమందిర మేనేజర్ హరిప్రసాద్‌రెడ్డి, కోటేష్, సురేష్, ప్రపంచ తెలుగు సమాఖ్య నెల్లూరు ప్రాంతీయ అధ్యక్షుడు నలుబోలు బలరామయ్యనాయుడు, అసోసియేషన్ అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): కొండాయపాళెం సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఆదివారం ఉండదని నెల్లూరు టౌన్ ఈఈ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్నేహనగర్, కావేరినగర్, కొండాయపాళెం, బ్యాంక్ కాలనీ, నక్కలగుంట, ఎల్ఐసీ కాలనీ, సంఘమిత్ర స్కూల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 11 వరకు సరఫరా ఉండదని వివరించారు.

ఆదమరిస్తే కాలువలోకే..



నెల్లూరు(బారకాసు): శెట్టిగుంటరోడ్డు నుంచి మైపాడు రోడ్డు, సత్యనారాయణపురం, జాకీర్‌హుస్సేన్‌నగర్ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. ఇక్కడ జాఫర్‌సాహెబ్ కాలువపై వంతెనను నిర్మించారు. అయితే దీనికి ముందు మురుగు కాలువ ప్రవహిస్తోంది. కాలువ పక్కనే ఉన్న సిమెంట్ రోడ్డు కుంగిపోయింది. ఈ మార్గంలో ద్విచక్రవాహనాలు, ఆటోలు, మినీ వ్యాన్లు, లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఎవరైనా ఆదమరిచి కుంగిన రోడ్డులోకి వాహనాన్ని దింపితే నేరుగా కాలువలో పడిపోయే ప్రమాదం పొంచి ఉంది. రాత్రి వేళ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వియానీ హోమ్‌లో అల్పాహారం అందజేత



నెల్లూరు(అర్బన్): పొదలకూరు రోడ్డులోని వియానీ హోమ్‌లో ఉంటున్న వారికి అల్పాహారం, బిస్కెట్లను శనివారం పంపిణీ చేశారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు మహబూబ్ బషీర్ మనవరాలు అమినుల్‌నిద మొదటి జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని నిర్వహించారు. రూడ్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రసూల్, అన్వర్ బాషా, మోమినా, పీహెచ్‌పీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వేణుగోపాల్, గోరంట్ల శేషయ్య, రాము, విలియమ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జయంతిని నిర్వహించాలని వినతి



నెల్లూరు(అర్బన్): విశ్వకర్మ భగవాన్ జయంతి కార్యక్రమానికి విశ్వబ్రాహ్మణులను ఆహ్వానించి ఒక వేదిక ద్వారా ప్రభుత్వమే నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య కోరారు. ఈ మేరకు కలెక్టరేట్లో జేసీ కార్తీక్, బీసీ కార్పొరేషన్ ఈడీ నిర్మలాదేవికి వినతిపత్రాలను వేర్వేరుగా శనివారం అందజేశారు. సంఘ గౌరవాధ్యక్షుడు సదాశివ ఆచారి, నేతలు చంద్ర, నాగార్జున, వరప్రసాద్, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన



నెల్లూరు సిటీ: నగరంలోని 24వ డివిజన్ ఇందిరమ్మ కాలనీలో రూ.1.4 కోట్లతో చేపట్టిన సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులకు సంబంధించిన శంకుస్థాపనను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి శనివారం నిర్వహించారు. గిరిధర్‌రెడ్డి, కార్పొరేటర్ అరవ శాంతి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా కృష్ణాష్టమి





గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో..



నెల్లూరు(బృందావనం): కృష్ణాష్టమి వేడుకలను నగరంలో భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. కృష్ణ భగవానుడ్ని దర్శించుకొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

- ఇస్కాన్ సిటీ సమీపంలోని హనుమాన్ మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను గోవిందరాజు సీతాదేవి సాహితీ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. రాధాకృష్ణులు, గోపికల వేషధారణలో చిన్నారులు సందడి చేశారు. సంగీత విద్వాంసురాలు శ్రీవత్సల శిష్య బృంద ఆధ్వర్యంలో కీర్తనలను ఆలపించారు. అనంతరం బాలలకు ప్రోత్సాహకంగా కృష్ణుడి చిత్రపటాలను అందజేశారు. నిర్వాహకురాలు గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు.
- డైకస్ రోడ్డు సెంటర్‌లోని పొగాకు గోడౌన్ల వద్ద కృష్ణ భగవానుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకొని చేపట్టారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి – ఇందూ జ్ఞానవేదిక నెల్లూరు నగర కమిటీ నిర్వాహకుడు చంద్రమౌళి పర్యవేక్షించారు.
- గురువాయూరప్పన్ జన్మాష్టమి వేడుకలను నగరంలోని అయ్యప్ప దేవస్థాన ప్రాంగణంలో గల గురువాయూర్ మహావిష్ణు ఆలయంలో నిర్వహించారు. తొలుత మహాలక్ష్మి గోదా సమేత గురువాయూర్ మహావిష్ణుకు స్నపన తిరుమంజనం, సహస్రనామార్చనలు, ఉట్టి మహోత్సవం, కోలాట ప్రదర్శనలను జరిపారు. అయ్యప్ప సేవా సమాజ అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గద్దం రత్నయ్య తదితరులు పర్యవేక్షించారు.



హనుమాన్ మందిరంలో..



డైకస్ రోడ్డు సెంటర్‌లో..

కేన్సర్ బాధితులకు ఆపన్నహస్తం



నెల్లూరు(బృందావనం): వనంతోపు సెంటర్ సమీపంలోని అబైడింగ్ హోప్ ట్రస్ట్ కార్యాలయంలో 50 మంది కేన్సర్ రోగులకు పౌష్టికాహార కిట్లను ట్రస్ట్ డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ శనివారం పంపిణీ చేశారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిశోర్, జయ, నిఖిల్, క్రాంతి, హేమచంద్ర తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత సమాజంపై సెమినార్ నేడు

నెల్లూరు(అర్బన్): డ్రగ్స్ రహిత సమాజం అనే అంశంపై హరనాథపురంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో సెమినార్‌ను ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించనున్నామని జేవీవీ నేత పోతంశెట్టి విద్యాచరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జేవీవీ నెల్లూరు నగర 18వ మహాసభలను పురస్కరించుకొని నిర్వహించనున్న కార్యక్రమానికి ఆసక్తి గల వారు హాజరు కావాలని కోరారు.